కల్పిక

# 'ఎలాగంటా, ఈ మనిషితో'

చోడవరపు బాబూరావు

'ఇదుగో వస్తానని వెళ్ళినవారు ఇప్పటికా రావటం? అప్పుడే పదకొండు గంటలయింది గదా, ఇంకా యెప్పుడు పొయ్యిమీద ఎసరెయ్యటం? ఏవీ, బజారుకెళ్ళి ఏమేం కూరలు తెచ్చారో చూపించండి! ఇవేనా తెచ్చినవి? ఇవేం వంకాయలు. వాటి మొహమే చెపుతోంది, సగానికి సగం పుచ్చు వంకాయలని. ఉన్నవాట్లో కల్లా చవకవి ఏరి తీసుకొస్తారు. అందులో సగానికి సగం పనికిరాక పారెయ్యవలసినవే నాయె, ఏం లాభం నా మొహం! ఆ మాటంటే, నీకేం మహరాజులాగా చెపుతావు, ముప్పై రూపాయలు తెచ్చుకునేవాడికి అసెంబ్లీ మెంబరు భోజనం కావాలంటే యెక్కణ్ణించి వస్తుందే పిచ్చిదానా- అంటారు. ఆ పుచ్చువేరి అవతలపారేసి త్వరగా పొయ్యి రాజెయ్యండి. నేను స్నానంజేసి ఇవతలకొచ్చేవరకూ ఈ మూడురోజులూ కాస్త ఆసరాగా వుంటారుగదా, ఆ పిల్లల్ని బళ్ళోకి పంపించట మెందుకూ అంటే విన్నారుగాదు. చదువుకునే పిల్లల్ని ఇంట్లో కూచోబెట్టట మెందుకంటారు. తమరు ఇంతా చదివి ఏదో పెద్ద వెలగబెడుతున్నట్లు! డిగ్రీ సర్టిఫికెట్లు చక్కగా పటాలు కట్టించి గోడకి తగిలించారుగాని తింటానికి మెతుకుండదు! ఆ పటాలయినా యెట్లా కట్టించారు? కొత్తఫ్రేము కొనటానికి పైసాలేక వద్దంటున్నకొద్దీ ఆ భద్రాచల రాములవారి పటం కాస్తా వూడబీకి కట్టించారు!

'చూడండి, కళ్ళూ ఒళ్ళూ ఎట్లా పీక్కుపోయాయో! అదేమిటో అర్ధరాత్రివరకూ ఏమిటో చదవటం, రాయటంతోనే సరిపోతుంది. పగలల్లా ఆఫీసులో పని చేసింది చాలక రాత్రిళ్లుకూడా ఆ ఆముదం దీపం ముందర అంతసేపు రాయటమేమిటమ్మా మరీనూ! అసలే కాస్త కిరసనాయిలువస్తుంది. ఆ కాస్తా హరించిపోయేదాకా రాశారు. ఇప్పుడు ఆముదం దీపంతో రాస్తున్నారు. పైగా ఆముదందీపం కళ్ళకి చాలా మంచిదని ఈమధ్య యెవరో రాజకీయ వినాయకులు వుపన్యసిస్తూ అన్నారని కూడా చెప్పారాయెను. ఇహ నే నేంజేసేది? కడుపునిండా తిండీ, కంటినిండా నిద్దరా లేకపోయింతర్వాత ఇహ యెట్లా గంటా యీమనిషితో.

'మొన్న ఆ ఎమ్. ఎల్. ఏ. గారి మరదలు పినతండ్రి మేనగోడలు చక్కగా బంగారపు గడియారంగొలుసు వేసుకుని పేరంటానికి కెడుతుంటే చూడ ముచ్చటవేసింది. పోని నాకేమీ అక్కర్లేదు- నేనిట్లా మోడులాగానే వుంటాను. పసివాడికి ఒక్క వెండిపుగ్గినైనా చేయిద్దామనుకుంటాను. అయ్యో, రాత! కోరికలు గుర్రాలెక్కమంటే, కర్మ గాడిదల్ని తోలమందిట!— ఉగ్గిన్నీ వద్దు, యేమీవద్దు - జరుపడిలేచిన పిల్లాడు గదా, కాస్త హార్లిక్సు సీసా తీసుకురమ్మంటే తీసుకొచ్చారు గనకనా? ఇదుగిదుగో ఇంక్రిమెంటు వస్తోంది, వచ్చేనెలలో తెస్తాలే అన్నారు. ఆరోవాడు పుట్టినప్పుడామాటే అన్నారు, వాడితరవాత దానికి ఆమాటే అన్నారు, ఆతరువాత వాడికీ ఆమాటే అన్నారు, ఇప్పుడు దీనికీ అదే చెపుతున్నారు! వాళ్ళకర్మాన సత్యానికి బతుకుతున్నారే గాని ఏం ఆహారముండి బతుకుతున్నారు?

'పెద్ద పిల్ల పెద్దదై రెండేళ్లు కావచ్చింది గదా, దాని పెళ్లిమాటేమన్నా తలపెడతారా. నేను నోరు చేసుకోవటమేగాని నామాట చెవిని పెడితేగద! 'ఇంకోఏడాది ఆగవే. అప్పటికి కాస్త వెనకవేసుకోవచ్చు-అంటారు. ఏమిటి వెనకవేసుకునేది? నెలనెలా వెనకవేసుకుంటూనే వున్నారు అప్పులు! బోలెడు కట్నంపోసి ఇప్పుడు పెళ్లెక్కడ చేసేదంటారు! చెయ్యకుండా అట్లాగే వుంచుతారా, మీకు ఇంక్రిమెంటొచ్చేదాకా?

స్వరాజ్యంరానీతే, పెద్దపిల్ల పెళ్ళి వైభవంగా చేస్తాను—అన్నారు. స్వరాజ్యం, స్వరాజ్యం అని చంకలు కొట్టుకున్నారు. అప్పుచేసి టీపార్టీ కూడా చేశారారోజున! ఇంతవరకూ పెళ్ళీలేదు నా మొహమూలేదు! రెండోది కూడా పెళ్ళి కెదిగి కూర్చుంది!

కాస్త చినుకుపడిందంటే చాలు ఇల్లంతా వరదలే గాయెను! కాస్త కప్పుమీద పెంకు తిరగవేయించండని ఎన్నాళ్ళనించో మొత్తుకుంటుంటే విన్నారూ? అదేదీ—ఆ హైదరాబాదు సంగతి తేలనీవే, అప్పుడు ప్రభుత్వం మన కోరికలన్నీ తీరుస్తుంది, అప్పుడు ఇంటికప్పు తిరిగివేయిద్దామన్నారు. హైదరాబాదు యుద్ధమై అన్నాళ్ళయింది, ఇంతవరకూ అతీ గతీ లేదు తిరగవేయించటం సంగతి! అన్నింటికీ అన్నిసాకులూ చెపుతారాయె! మట్టిగోడల్నిండా ఎలుకకన్నాలే! అవి మెత్తించమంటే, కాశ్మీరు యుద్ధం పూర్తి గానీ మన్నారు! ఇహ యెట్లాగంటూ, యీ మనిషితో!

'ఆ, ఆ, ఆగండాగండి! ఆగుడ్డల్తో వూరగాయ జాడీ కాస్తా ముట్టుకుని మైలపడేస్తారా యేమిటి? రెండేళ్ళనాటి వూరగాయ, కొద్దిగా మిగిలింది. ఆ కాస్తా మైలబడేస్తే యిహ తిన్నట్లే! మళ్ళీ ఈ యేడు వూరగాయి సంగతెత్తితే, ఇంక్రిమెంటు రానీ అంటారు. మొన్న రాకరాక మాతమ్ముడూ మరదలూ వస్తే వున్న రెణ్ణాళ్లూ రెండేళ్లనాటి ఆవకాయ ముక్కేసి అన్నం పెట్టటానికి చచ్చిపోయినంత సిగ్గేసింది పాపం మన స్థితిగతులు గ్రహించినవాళ్లే గనక, అదే సరిపెట్టుకుని యేమీ అనుకోకుండా వెళ్లారు. ఆ మాటంటే పుట్టింటి వాళ్ళని వెనకవేసుకొచ్చి పోట్లాడావంటారు. ఆ విస్తట్లో కాస్త అన్నంపెట్టి ఆ వూరగాయముక్క మడితోనే తీసివేసి ఇట్లా నాముందర పడెయ్యండి. నాకు నెయ్యక్కర్లేదు. గూట్లో నేతిగిన్నెలో కొద్దిగా నెయ్యివుంది. అది మీరూ పిల్లలూ వేసుకోండి, ఈపూట వస్తుంది. నాకు పెట్టి మీరు కూడా పెట్టుకుని అన్నం గిన్నెమీద మూతవేసి మరీ వెళ్ళండి.

'అదుగో, సమయానికి లేచాడు వుయ్యాల్లో వాడు! ఆకలితో ఏం నిద్ర పట్టేసుస్తుంది వాడికి మాత్రం! మడిబట్ట విడిచి వాణ్ణి నాదగ్గర పడుకోబెట్టి మళ్ళీ మడి గట్టుకోండి .. .దూరంగా, దూరంగా! అట్లా తాకుతారేం, మతిలేదా యేమిటి, యెన్నేళ్ళొచ్చినా ..! పిల్లాణ్ణెత్తుకోటం చాతగాదు! ఆ విస్తర రక్కడపెట్టి ఇహ మీపని చూసుకోండి.

'అనుకున్నంతా అయింది, నలభీమ పాకం! ఇది అన్నమో బియ్యమో తెలియటంలేదు! కూరంతా వుప్పుమయం, పులుసేమో గొడ్డుకారం! అందులో వెయ్యవలసిన కారం ఇందులోనూ, ఇందులో వుప్పు అందులోనూ వేశారు గావును! ఇహ తినండి యేం తింటారో! గాంధీగారు మేక పాలు తాగి వుండేవారని మీరేగా చెప్పారు. ఇహనేం మీరుకూడా ఆపనే చెయ్యండి సరిపోతుంది! ఇవాళిటికి వుపోషం! బియ్యంకూడా నిండుకున్నట్టున్నై. అట్లా తెల్లబోయి గుడ్లు వెళ్ళబెట్టి చూస్తారేం? బళ్ళొంచి పిల్లలు ఆకలి అంటూ వస్తే యేం సమాధానం చెపుతారో చెప్పండి! కాశ్మీరుతో ప్లెబిసైటు పూర్తయేదాకా ఆగమంటారు గావును!'

ప్రఖ్యాత సినిమా నటీమణికి జబ్బు చేసింది. చోటు మార్చడం, కార్యక్రమంలో కొంత మార్పు అవసరమని డాక్టరు సలహా యిచ్చాడు ఆమె యిలా అంది: 'మార్పా! మీకు తెలుసా, గత ఎనిమిది మాసాల్లో నేను నాలుగుసార్లు వివాహం చేసుకున్నాను; అయిదు కార్లు మార్చాను; రెండుసార్లు ఇంట్లో దొంగలు పడ్డారు; మూడు సినిమాల్లో నటించాను—ఇంకా ఏం మార్పు కావాలి?'